విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్ అందజేత

విద్యార్థులకు వస్తువులను అందజేస్తున్న కృష్ణప్రసాద్

ఆర్కేపురం, డిసెంబర్ 23 : ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో సోమవారం లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు, స్టేషనరీ, స్కూల్ బ్యాగ్స్, స్నాక్స్, టవల్స్, పిల్లోస్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లైన్స్ డిస్ట్రిక్ట్-320 సీ గవర్నర్ కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1000 మంది విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందజేశానని తెలిపారు. భవిష్యత్తులో అనాథ గృహ విద్యార్థుల ఉద్యోగాల విషయంలో సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్, గుంటక శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సురేశ్‌కుమార్, లక్ష్మిమూర్తి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయాలి

వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

కందుకూరు, డిసెంబర్ 23 : విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రంగారెడ్డి అధ్యక్షుడు గోపాల్ నాయక్ కోరారు. సోమవారం సాయంత్రం కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర 6వ మహాసభలు ఈ నెల 28నుంచి 30 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభ ప్రభుత్వ విద్యారంగంపై మేధావుల ఆధ్వర్యంలో కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, విశ్లేషకులు పాల్గొంటారని పేర్కొన్నారు. మహా సభలకు సంఘం ఉపాధ్యాయులు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు అంజయ్య, కవిత, ప్రిన్సిపాల్ విష్ణుప్రియ,యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రవి, ప్రధాన క్యాదర్శి డాక్టరు బుగ్గరాములు,నాయకులు ఈశ్వర్, బక్యా నాయక్, జైపాల్, శ్రీనివాసరావు, స్టాన్లీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్‌ను త్వరగా పూర్తి చేయాలి

తుమ్మలూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

లెనిన్ నగర్ బస్తీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబిత

బడంగ్‌పేట, డిసెంబర్23: మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం సుడి గాలి పర్యటన చేశారు. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరులో ప్రభుత్వ పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్నాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. లెనిన్‌నగర్‌లో ఉన్న ఫంక్షన్ హాల్‌ను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. బస్తీ వాసులతో కూర్చొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు అవసరమైన వాటిని త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఫంక్షన్ హాల్ పనులు త్వరగా పూర్తి చేస్తే పేద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తా

లయన్ మహేంద్రకుమార్‌రెడ్డికి అవార్డు ప్రదానం చేస్తున్న పెట్రీషియో

కందుకకూరు, డిసెంబర్ 23 : లయన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని 320ఏ జిల్లా వైస్ గవర్నర్ లయన్ డాక్టర్ మహేంద్రకుమార్ రెడ్డి తెలిపారు.ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లీడర్ షిప్ మోడల్ అవార్డు కింద ఎంపిక చేసి అవార్డును ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పెట్రీషియో, ఇంటర్నేషనల్ చైర్ పర్సన్ పాటీ హిల్స్, వైస్ ప్రెసిడెంట్ సింగ్ చేతుల మీదుగా ఆయనకు అవార్డును సోమవారం అందజేశారు. లయన్స్ క్లబ్‌ను కందుకూరులో ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్యంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు చేరువయ్యారని పెట్రీషియో తెలిపారు. అనంతరం మహేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషిస్తుందుకు తన సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ స్థాయిలో అత్యుత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మరింత సేవ కార్యక్రమాలను చేపట్టె అదృష్టం కలిగిందని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్‌ను కష్టపడి మరింత ముందుకు తీసుకువెళ్లానని, లయన్స్ క్లబ్‌ను విస్తరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు సురుసాని విఠల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బీంరెడ్డి రామ్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, దీపారెడ్డి, లయన్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి సైన్స్ ఎంతో అవసరం

మోడల్ ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో నరసింహ, ఉపాధ్యాయులు

కందుకూరు, డిసెంబర్ 23 : జీవశాస్త్రం అభ్యసనంతో సైంటిస్టులు,డాక్టర్లుగా ఎదుగవచ్చని మండల విద్యాధికారి నరసింహ తెలిపారు. కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల స్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్టును ప్రారంభించారు. టెస్టుకు మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. మోడల్ ప్రశ్న పత్రాలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. జీవశాస్త్రంలో నైపుణ్యతను పెంపొందించుకున్నట్లయితే సైంటిస్టులు, డాక్టర్లుగా ఎదుగవచ్చని అన్నారు. జిల్లా సైన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ సైన్స్‌పై అవగాహన కలిగి ఉంటే ఉన్నతలుగా ఎదుగుతారని తెలిపారు. నేటి సమాజానికి సైన్స్ ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అంజయ్య, గోవర్ధన్‌రెడ్డి, జీవశాస్త్ర సబెక్టు ఫోరం అధ్యక్షుడు రవి, భూక్యానాయక్, మణిమాల, శ్రీనివాస్, శాంతకుమారి, రాంమోహన్, స్టాన్లీ అన్వర్, రాజు, కల్పన,బాలికల పాఠశాల హెచ్ఎం కవిత, విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో తెలుగులో విజేతలుగా తిమ్మాపూరు హైస్కూల్ విద్యార్థిని శ్రీజ, కందుకూరు విద్యార్థిని శ్రీజ, ఆంగ్ల మాధ్యమంలో గూడూరు పాఠశాల విద్యార్థి యశ్వంత్, తిమ్మాపూరు పాఠశాల విద్యార్థి అభినవ్, మోడల్ స్కూల్ విద్యార్థి విఘ్నేశ్‌లు ఎంపికయ్యారు, ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగే పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రజావాణిలో సమస్యల పరిష్కారం

ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్ భేగ్

కందుకూరు, డిసెంబర్ 23 : సమస్యల పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కందుకూరులోని తన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, బాలాపూరు, కందుకూరు, మహేశ్వరం, సరూర్‌నగర్, తలకొండపల్లి మండలాల నుంచి 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో ప్రధానంగా రెవెన్యూ సమస్యలు వచ్చాయని వివరించారు. మండల పరిధిలోని నేదునూరులో ప్రజా పాలనలో 1700 మంది 6 గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 300 వరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారని మిగిలిన దరఖాస్తులు తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రజలకు మేలు చేయాలని వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ భేగ్, గణేశ్, లక్ష్మయ్య, బాబు,శివగౌడ్,సురేశ్, అన్వర్ ఆయనకు వినతి పత్రం అందజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ మండలాల ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఫిర్యాదులు..

ఎల్బీనగర్: సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత

టీజీసీటీఏ ఎన్నికల్లో డాక్టర్ బ్రిజేశ్ ప్యానల్ ఘన విజయం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ డిగ్రీ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) ఎన్నికల్లో డాక్టర్ బ్రిజేశ్ ప్యానల్ ఘన విజయం సాధించింది. ఓయూ ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించిన ఎన్నికల్లో డాక్టర్ బ్రిజేశ్ ప్రధాన కార్యదర్శిగా రెండోసారి విజయం సాధించారు. అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, చైర్మన్‌గా డాక్టర్ సౌందర్య జోసెఫ్, మహిళా కార్యదర్శిగా డాక్టర్ ఎం.భవాని, అకాడమిక్ కార్యదర్శిగా డాక్టర్ గోపాల సుదర్శనం, ఆర్థిక కార్యదర్శిగా డాక్టర్ గంగాధర్, ఉపాధ్యక్షులుగా మల్టీజోన్ 1 నుంచి డాక్టర్ ఆడెపు రమేశ్, మల్టీజోన్ 2 నుంచి డాక్టర్ జీఎన్ జగన్, కార్యదర్శిగా మల్టీజోన్ 1 నుంచి డాక్టర్ హరీశ్‌కుమార్, మల్టీజోన్ 2 నుంచి డాక్టర్ రామాచారి, ఓయూ కార్యదర్శిగా డాక్టర్ రాకేశ్ భవాని, కేయూ కార్యదర్శిగా డాక్టర్ సమ్మయ్య, మహాత్మాగాంధీ వర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ యాదయ్య, పాలమూరు యూనివర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ పి.రాములు, శాతవాహన వర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ రాజేశ్ ఎన్నికయ్యారు. బ్రిజేశ్ మాట్లాడుతూ డిగ్రీ లెక్చరర్ల సమస్యలపై పోరాడుతామన్నారు. ఉన్నత విద్యాశాఖలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసేందుకు ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.

పార్కు స్థలాన్ని హైడ్రా పరిశీలన

పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బడంగ్‌పేట, డిసెంబర్23: కొన్ని నెలల నుంచి పార్కుల కబ్జా పై బడంగ్‌పేట మేయర్, కమిషనర్‌కు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోక పోవడంతో హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశానని బీజేపీ బడంగ్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు చెరుకు పల్లి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈనెల 16న హైడ్రా అధికారులకు ఫిర్యాదు ఇవ్వగా ఆక్రమణకు గురైన పార్కును సోమవారం పరిశీలించారు. అందుకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించారని ఆయన పేర్కొన్నారు. చాలా సార్లు మేయర్, కమిషనర్ పట్టించుకోక పోవడమే కాకుండా కబ్జాదారులకు అండగా ఉన్నారని ఆయన ఆరోపించారు. కోట్ల విలువ చేసే స్థలాలను కాజేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదన్నారు. టీపీవో అందుబాటులో లేక పోవడంతో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది హైడ్రా అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు.

టిమ్స్ దవాఖానను వేగంగా పూర్తి చేయాలి

చైతన్యపురిలోని టిమ్స్ ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని టిమ్స్ ఆసుపత్రిని సందర్శించి పనులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖాన భూ సమస్యను పరిష్కారించామన్నారు. 2021లో ఆసుపత్రిని ప్రకటిస్తే ఇప్పటివరకు 27 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, ఈ పనుల వేగాన్ని పెంచి ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలన్నారు. టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తే ప్రైవేటు ఆసుపత్రుల భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటుగా అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

-ఎల్బీనగర్, డిసెంబర్ 23:

అద్దంలా అంతర్గత రహదారులు

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, డిసెంబర్ 23 : మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట డివిజన్, పటేల్‌నగర్‌లో రూ.13 లక్షల అంచ నాతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు ఏర్పాటు పనులను కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవకర్గ వ్యాప్తంగా కొత్తగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో పాటు మంచినీటి, డ్రైనేజీ, పార్కుల సుందరీకరణ, కమ్యూనిటీహాల్‌ల ఏర్పాటు వంటి పనులు విస్తృతంగా చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా స్థానికులను వేధిస్తున్న డ్రైనేజీ, మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీగంద్, వర్క్ఇన్‌స్పెక్టర్ దుర్గ, బీఆర్ఎస్ నాయకుడు జాఫర్‌తో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, డిసెంబర్ 23 : జేబీ కాలనీ, మోర్, విజయపురి, ఆనంద్‌నగర్, లక్ష్మీనగర్, అల్కాపురి, గణేశ్‌నగర్, నరసింహపురి, పసుమాముల, హరిపురి, కొత్తపేట్, మారుతీనగర్, గ్రీన్‌హిల్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్ నగర్ విద్యుత్‌శాఖ డీఈ కె.కె.రామకృష్ణ తెలిపారు. జేబీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు జేబీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, క్రాంతినగర్, సాయి క్రిష్ణానగర్ పరిసర ప్రాంతాలు, మోర్ పరిధిలో ద్వారకానగర్, గ్రీన్‌హిల్స్ కాలనీ, మార్గదర్శి కాలనీ, మోర్ పరిసర ప్రాంతాలు, విజయపురి పరిధిలో విజయపురి కాలనీ, లక్ష్మీనగర్, ఎస్‌బీఐ కాలనీ, టెలిఫోన్ కాలనీ రోడ్డు నెం.1, కొత్తపేట్ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలు, ఆనంద్‌నగర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఆనంద్‌నగర్, హయత్‌నగర్, దసరా టెంపుల్, కుమ్మరి బస్తీ, పద్మావతి కాలనీ, శాంతివనం టౌన్‌షిప్, శ్రీనివాస కాలనీ పరిసర ప్రాంతాలు, లక్ష్మీనగర్ పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 వరకు లక్ష్మీనగర్, గాయిత్రీపురం, గౌడ్స్ కాలనీ, నాగేశ్వర్‌రావు కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యనారాయణ, న్యూ మారుతినగర్ పరిసర ప్రాంతాలు, అల్కాపురి పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు అల్కాపురి, ఆర్కేపురం, స్నేహపురి పరిసర ప్రాంతాలు, గణేశ్‌నగర్ పరిధిలో గణేశ్‌నగర్, కుంట్లూరు, నారాయణ కళాశాల, శివశంకర్ కాలనీ, రత్న కాలనీ, ఇష్టకామేశ్వరి దేవాలయం పరిసర ప్రాంతాలు, నరసింహపురి పరిధిలో మధ్యాహ్నం 1గంట నుంచి 2 వరకు నరసింహపురి కాలనీ, హుడా కాలనీ, డాక్టర్స్ కాలనీ రోడ్డు నెం,1టూ 4 పరిసర ప్రాంతాలు, కోహెడ పరిధిలో శాంతినగర్, బ్యాంక్ కాలనీ, సదాశివనగర్, మైత్రీసిరిపురం పరిసర ప్రాంతాలు, పసుమాముల పరిధిలో సత్తిరెడ్డి కాలనీ, సదన్న కాలనీ, కమలానగర్, ఇటుకల లేఅవుట్, శ్రీరామ కాలనీ, పసుమాముల పరిసర ప్రాంతాలు, హరిపురి పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు హరిపురి కాలనీ, ఎన్టీఆర్‌నగర్ లాస్ట్‌బస్టాప్, సాయిబాబానగర్, న్యూ హరిపురి కాలనీ పరిసర ప్రాంతాలు, కొత్తపేట పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు శాంతినగర్, బ్యాంక్ కాలనీ, సదాశివనగర్, మైత్రీసిరిపురం పరిసర ప్రాంతాలు, న్యూ మారుతీనగర్ పరిధిలో న్యూ మారుతీనగర్, లక్ష్మీనగర్ పరిసర ప్రాంతాలు, గ్రీన్‌హిల్స్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4 వరకు గ్రీన్‌హిల్స్ కాలనీ రోడ్డు నెం,1,2,3,4, క్రిష్ణానగర్, ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబర్ 23: నాగోల్ డివిజన్ పరిధి జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో మంగళవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్న రుగ్వేద, యజుర్వేద, సామవేద హవన సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాల బ్రోచర్‌ను సోమవారం రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైదిక విజ్ఞాన ట్రస్ట్ వ్యవస్థాపకుడు వాడ్రేవు శ్రీనివాసరావు, ధర్మరక్ష సంస్థ వ్యవస్థాపకులు చిట్టి హనుమత్ శాస్త్రి మాట్లాడుతూ పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం గురువందనం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, దీక్షా ధారణ, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, రుగ్వేద, యజుర్వేద, సామవేద హవనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు వేదహవనములతో పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారని తెలిపారు. జనప్రియ ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాలకు మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

కాచిగూడ, డిసెంబర్ 23 : తెలంగాణలో నిర్వహించే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్ని గుండమే అవుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ యువజన రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బీసీ నాయకుడు మిరియాల యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో వివిధ సంఘాల బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలని, రిజర్వేన్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుకు తక్షణమే చర్యలు చేపట్టాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

రవీంద్రభారతి, డిసెంబర్ 23: కూచిపూడి శాస్త్రీయ నృత్యాలను పరిరక్షించుకొని భవిష్యత్ తరాలకు అందించాలని సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సాయి నృత్య డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం బిర్లఆడిటోరియంలో శిష్య శారదాంజలి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు, విశిష్ట అతిథిగా మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, నిర్వాహకులు శాలీని శ్రీనివాస్న్, సౌమ్య శ్రీధర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సభకు ముందు నృత్యకారినుల కూచిపూడి నృత్య ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి

ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

వనస్థలిపురం, డిసెంబర్ 23 : పేద, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్న విద్యా సంస్థలను కట్టడి చేసేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చెన్నోజు శ్రీనివాసులు కోరారు. సోమవారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యుడు విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రజలను ఫీజుల పేరుతో దోచుకుంటున్నాయన్నారు. ఆయా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రం కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. లక్షల్లో దోచుకుంటున్న సంస్థలను అదుపు చేయాలంటే చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల అనారోగ్యం, మరణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని అందజేశారు.

ముగ్గుల పోటీలు

కాచిగూడ, డిసెంబర్ 23: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ రాబోయే తరాలకు అందించాలని జీహెచ్ఎంసీ మాజీ అధికారి రామస్వామి పిలుపునిచ్చారు. పీజేఆర్ పార్కులో ముగ్గుల పోటీలను నిర్వహించారు.

గోవులను కాపాడాలి

ఎల్బీనగర్, డిసెంబర్ 23 : గోవులను కాపాడాలని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మూడు మాసాల నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్న బాలకృష్ణ గురుస్వామి తెలంగాణలో పాదయాత్ర చేస్తూ సోమవారం కొత్తపేట చౌరస్తాలోని భవానీ దేవాలయానికి చేరుకున్నారు. భవానీ ఆలయం వద్ద హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో బాలకృష్ణ గురుస్వామికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భవానీ మాత ఆలయం చైర్మన్ భావన రుషి, హనుమాన్ యువసేన అధ్యక్షుడు యశ్పాల్ గౌడ్, అఖిల్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్, భాస్కర్, కిరణ్, తరుణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కళలను పరిరక్షించుకోవాలి

రవీంద్రభారతి : అంతరించిపోతున్న జానపద కళలు, కళాకారులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, పూర్వ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ , సారిపల్లి కొండల్‌రావు ఫౌండేషన్ సౌజన్యంతో యువకళావాహిని, రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు నగదు పురస్కారం - ఆత్మీయ సత్కార కార్యక్రమం సోమవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండలరావు సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆత్మీయ సత్కారం చేశారు.

రైతు దినోత్సవం

బడంగ్‌పేట, డిసెంబర్23: దేశానికి రైతు వెన్నెముక అని శ్రీచైతన్య జీఎం సతీశ్ అన్నారు. మహేశ్వరంలోని శ్రీచైతన్య స్కూల్‌లో సోమవారం రైతు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను సన్మానించారు. విద్యార్థులు రైతు వేషధారణతో ప్రదర్శనలు ఇచ్చారు. వ్యవసాయం పై విద్యార్థులకు అవగాహన కల్పించడానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సతీశ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్, కో ఆర్డినేటర్ జితేందర్, ఏవో ప్రమోద్, డీన్ శ్రీనివాస్, నిర్మల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఈ ప్రకటన ద్వారా నా క్లయింటు శ్రీ మారంరెడ్డి ధన్‌రాజ్ రెడ్డి S/o. మర్‌రెడ్డి R/o. K.K. బస్తీ, నేదునూరు గ్రామము, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా గారు తెలియజేయునది ఏమనగా, తన యొక్క భూమి సర్వే నంబరు 638, విస్తీర్ణము 7-10 గుంటలు, సర్వే నంబరు 641, విస్తీర్ణము 5-24 గుంటలు, మొత్తం విస్తీర్ణము 12-34 గుంటలు, నేదునూరు రెవెన్యూ గ్రామము, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా గలదానిని, అతని చిన్నాన్న అయిన మారంరెడ్డి చిన్నపురెడ్డి S/o. రాయపు రెడ్డి గారు లీజు ఆధారంగా సాగుచేస్తూ అక్రమంగా పట్టా చేసుకొని కొంత భూమిని ఇతరులకు అన్యాక్రాంతం చేసినందున మరియు కొంత భూమిని అతని కుమారునికి మార్పిడి చేసినందున, నా క్లయింటు తన చిన్నాన్న పైన, అతని కుమారుడయిన మారంరెడ్డి రాయపురెడ్డి పైన, అతని మనుమడయిన మారంరెడ్డి రోహిత్ రెడ్డి పైన మరియు ఇతర వ్యక్తులపైన, ఆ యొక్క భూమి హక్కులు నిర్ధారించుటకు, భూమి తిరిగి స్వాధీనం కొరకు, రెవెన్యూ రికార్డులు సవరణకు మరియు అక్రమ రిజిస్ట్రేషన్ దస్తావేజులు రద్దు పరుచుట కొరకై, నా క్లయింటు దావావేయడం జరిగినది. ఆ యొక్క దావా నంబరు O.S. 7/2024 అది గౌరవ 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రంగారెడ్డి జిల్లా, ఇబ్రహింపట్నం నందు పెండింగ్‌లో ఉన్నది మరియు సదరు భూమిని ఇతర వ్యక్తులకు అన్యాక్రాంతం చేయరాదు అని తెలిపే అర్జీ కూడా పెండింగులో ఉన్నది. కావున సాధారణ ప్రజానీకానికి నా క్లయింటు ఇందుమూలంగా హెచ్చరించడం ఏమనగా, ఎవరేని వ్యక్తి గాని వ్యక్తులుగాని సదరు భూమి విషయంలో ఏదేని లావాదేవీలు జరిపిన యెడల పైన తెలిపిన కేసు ఉన్నందున ఆ యొక్క లావాదేవీలు చట్టం దృష్టిలో చెల్లనేరవు అని తెలియజేస్తున్నాము మరియు ఈ ప్రకటన వెలువడిన తర్వాత కూడా ఏదేని లావాదేవీలు పై వ్యక్తులతో జరిపిన యెడల నా క్లయింటు తీసుకొనే చర్యలకు వారే బాధ్యులగుదురు అని తెలియజేస్తున్నాము.

తేది: 23-12-2024

సం/- D. రవీందర్ రెడ్డి
న్యాయవాది
Ph: 9849193422
ఇబ్రహింపట్నం, రంగారెడ్డి జిల్లా